# గతించిన తరం కవులలో మేరునగధీరుడు శ్రీశ్రీ

**1950, 60** దశకాల్లో యువతీ యువకులకు కవిత్వమంటేనే శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ). మరీ ముఖ్యంగా తమ కోపావేశాల్ని వెళ్ళగక్కాల్సి వచ్చినప్పుడు ఎవరికైనా ఆయన కవితలే శరణ్యమయ్యేవి. అందుకే వారిలోని వీరాభిమానులు కొందరు ఆయన మరణించినప్పుడు నివాళులర్పిస్తూ ఏకంగా 'శ్రీశ్రీకి ముందూ వెనకా అంతా శూన్యమే' అనేశారు. అవినయుడైన మేధావి కావడం వల్ల ఒకానొక సందర్భంలో శ్రీశ్రీయే తన గురించి తాను '1930కి ముందు తెలుగు కవిత్వం నన్ను నడిపించింది; '30ల తర్వాత తెలుగు కవిత్వాన్ని నేను నడిపిస్తున్నాను' అనీ, దాన్నే మరికాస్త పదునుగా 'ఈ శతాబ్దం నాది' అని చెప్పుకున్నప్పటికీ ఈ అభిప్రాయాన్నయితే బహుశా ఆయన కూడా తిరస్కరించి ఉండేవాడు.

ఆ సంగతెలా ఉన్నా గత తరంలోని కవులలో శ్రీశ్రీ నిజంగానే మహానుభావుడు. 1910లో పుట్టిన శ్రీశ్రీ చిన్నప్పుడే సంప్రదాయ పద్ధతిలో వచనం, పద్యం కూడా రాసేవాడు. ఒక రకంగా ఆయన్ని బాలమేధావి అనొచ్చు. గతానికీ భవిష్యత్తుకీ మధ్య వైరుధ్యాలు తీవ్రంగా ఉన్న వాతావరణంలో పెరిగాడతను. సంఘ సంస్కరణోద్యమం కొన్ని మధ్యయుగపు హిందూ సంప్రదాయాలతో పోరాడుతూ, సమాంతరంగా కొత్త సాహిత్యాన్ని, కొత్త నుడికారాన్ని సృష్టిస్తున్న సమయమది. శ్రీశ్రీ జన్మస్థలమైన విశాఖపట్నం జిల్లాకే చెందిన గురజాడ అప్పారావు ఆనాటికే – ఈనాటికీ తెలుగులో అతి గొప్ప నాటకంగా భావించబడే 'కన్యాశుల్కం' రచించి ఉన్నాడు. ఛందస్సు, గణాల వంటి కృత్రిమత్వం కింద శతాబ్దాల పాటు నలిగిపోయిన తెలుగు కవిత్వం అప్పుడప్పుడే ఆ సంకెళ్ళను తెంచుకుని వచన కవితారూపం తీసుకుంటోంది. ఆదర్శ ప్రణయగాథలతో పాటు సామాజిక విమర్శా విషయాలను కవితా వస్తువుగా తీసుకోవడం కూడా అప్పుడే మొదలైంది. శ్రీశ్రీ తొలి సాహిత్య గురువులు ఇద్దరు. ఒకరు ఛాందస బ్రాహ్మణ పాయకు చెందిన మహాపండితుడూ, ప్రగతిశీల భావాలకు బద్ధవిరోధి అయిన విశ్వనాథ సత్యనారాయణ అయితే – ఈయనకు ఆ తర్వాత జ్ఞానపీఠ్ కూడా వచ్చింది –

రెండో వ్యక్తి జీవితాంతం భావకవిగానే ఉండిపోయిన దేవులపల్లి కృష్ణశాస్త్రి. వారిద్దరి ప్రభావం నుంచి బయటపడడానికి తనకు దశాబ్దకాలం పట్టిందని శ్రీశ్రీయే స్వయంగా చెప్పుకున్నాడు. అలాగే తన మీద మధ్యతరగతి సంస్కరణవాద తొలి దశ ప్రభావం కూడా ఉన్నట్లు తర్వాత కాలంలో శ్రీశ్రీ గుర్తించాడు. ఆనాడు దేశమంతటా ఉన్న ధోరణే ఇది. దీని మూలం శిష్టవర్గాలలో ఉంది – జమిందారీ వర్గాలని కూడా అనొచ్చు. అయితే శ్రీశ్రీ తన సంపూర్ణ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించుకుంది ఈ రోజుల్లో కాదు. ఆకలి రోజులుగా చెప్పబడే 30వ దశకంలో ఆధునిక భావధార ప్రపంచాన్ని ముంచెత్తినప్పుడు ఆయన ప్రగతిశీల కవిగా రూపొందాడు. ముల్క్‌రాజ్ ఆనంద్‌లా శ్రీశ్రీ ఇంగ్లాండ్‌లో చదువుకుని ఉండకపోవచ్చు గానీ, తక్కిన వారిలా తను కూడ ఆ కాలంనాటి భావజాలంతో విపరీతంగా ప్రభావితుడయ్యాడు. సాహిత్యానికి భౌతికవాద విమర్శ పనికి వస్తుందనడానికి ఇంతకంటే వేరే రుజువు అక్కరలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో కనిపిస్తున్న వచ్చిన ఆర్థిక మాంద్యానికి, సోషలిస్టు వ్యవస్థలో ఆర్థిక సుస్థిరతకూ మధ్య తీవ్ర వైరుధ్యాలు బహిర్గతమైనప్పుడు లండన్‌లో చదువుకుంటున్న విద్యార్థిలోనైనా, కోస్తాంధ్రలోని మారుమూల పట్టణంలో నివసిస్తున్న ఒక అనామక యువకుడిలోనైనా ఒకేరకమైన ఆలోచనలు, ఒకే రకమైన తీవ్రతతో వెలికివస్తాయని రుజువైంది.

అప్పటికే శ్రీశ్రీకి పాశ్చాత్య సాహిత్య ధోరణులైన ప్రతీకవాదం, అధివాస్తవిక వాదాలతో పరిచయం ఉంది గానీ ఆ తరవాత కాలంలో విశాలాంధ్రను ఒక్క ఊపు ఊపనున్న తన కవితలలో మొదటిదాన్ని ఆయన లండన్‌లో ఏర్పడ్డ భారత అభ్యుదయ రచయితల సంఘం గురించి తెలియకపూర్వమే రాశాడు. 1930 దశకంలో శ్రీశ్రీ వరసపెట్టి ఎన్నో శక్తిమంతమైన కవితలు రచించాడు. కుళ్ళి కంపుకొడుతున్న ఫ్యూడల్ సంస్కృతిని చీల్చి చెండాడే పదజాలంతో యువతను కేవలం మేల్కొలిపే విధంగానే కాక, వారిని ప్రేరేపించేలా ఎన్నో కవితలు రాసాడు. శ్రీశ్రీ తొలి రోజుల్లో రాసిన కవిత్వాన్ని ఆంగ్లంలోకి అనువదించడం మన దేశస్తులకు అసాధ్యం. వలస పాలకులు మనకు నేర్పిన ఇంగ్లీష్ కేవలం విజ్ఞాపన పత్రాలను తయారు చేయడానికి పనికొచ్చేదే కానీ, డైనమైట్ ధ్వనిని అనువదించ డానికి పనికి వచ్చేది కాదు. స్వయంగా శ్రీశ్రీయే భారతదేశంలోని తెలుగేతరుల కోసం తన కవిత్వాన్ని అనువదించడానికి ప్రయత్నించి, విఫలమయ్యాడు. శ్రీశ్రీ కవిత్వం

అనువాదానికి లొంగకపోవడానికి ముఖ్య కారణం ఆయన విరివిగా వాడే హిందూ పురాణ ప్రతీకలు. దీని కారణంగా వామపక్ష విమర్శకులకూ ఆయనకూ మధ్య తరచూ సంవాదాలు సాగుతూండేవి కూడా. *పుడమి తల్లికి పురిటి నొప్పులు కొత్త సృష్టిని స్ఫురింపించాయి, యముని మహిషపు లోహ ఘంటలు, నరకలోకపు జాగిలమ్ములు, కనకదుర్గా చండసింహం జూలు విదిలించింది, ఇంద్రదేవుని మదపుటేనుగు ఘీంకరించింది,* మొదలైనవన్నీ ఇలాంటివే. ఆయన సుప్రసిద్ధ కవితా సంకలనం 'మహాప్రస్థానం' శీర్షిక కూడ మహాభారతం చివర్లో పాండవులు స్వర్గానికి చేసిన ప్రయాణాన్ని సూచించేదే.

భూకంపం లోయలను నదులుగానూ, ఎడారులను పర్వతాలుగానూ మార్చేసినట్లుగా, శ్రీశ్రీ కూడ తెలుగు సాహిత్యాన్ని గుర్తుపట్టలేనంతగా మార్చేసాడు. సంప్రదాయ కవిత్వం వెన్ను విరిచాడు; వచన కవిత్వాన్ని సౌందర్యవర్ణన నుంచి మరో ప్రపంచాన్ని ఆహ్వానించే పదునైన భాషకు మళ్ళించాడు.

ముప్ఫయ్యవ దశకం ఆకలి దశాబ్దే కాదు; ఎరుపెక్కని మార్క్సిజానిది కూడా. విదేశాల్లో చదువుకుంటున్న జయప్రకాశ్ నారాయణ్, జవహర్‌లాల్ నెహ్రూ వంటి వారి నుంచి ఫక్తు స్థానికులదాకా చాలామంది ఆఫ్రో – ఆసియా మేధావులు తమకు తెలిసిన కొద్దిపాటి మార్క్సిజానికే ఆ రోజుల్లో 'రాడికల్స్'గా భావించబడ్డారు. వీళ్ళ రాడికలిజం రాత్రికి రాత్రి మాయమవడానికి, ఆ తరవాత వారు రాజకీయ ప్రాభవాన్ని వెతుక్కుంటూ పదవుల వెంటపడడానికి వారు నేర్చుకున్న నాసిరకం మార్క్సిజమే కారణమని కొశాంబి ఏదో సందర్భంలో అన్నాడు. ఇది రాజకీయ వేత్తల విషయంలో ఎంత నిజమో సాహితీవేత్తల విషయంలోనూ అంతే నిజం. ఆ రోజుల్లో స్పానిష్ అంతర్యుద్ధం గురించి, స్టాలిన్‌గ్రాడ్ పోరాటం గురించి అద్భుతమైన కవితలు రాసిన కవుల జీవితాల్లోకి తొంగిచూస్తే దిగ్భ్రాంతికరమైన అవకాశవాదం, అయోమయం, తిరోగామితనం కనబడతాయి. అయితే ఇలాంటి నేపథ్యంలోనూ చివరిదాకా – తడబడుతూ, ఇబ్బందిపడుతూనే కావచ్చు – నిలబడ్డ కొద్దిమందిలో శ్రీశ్రీ ఒకరు. దీనికి ఆయన వ్యక్తిత్వం ఒక కారణం కాగా, వామపక్ష ఉద్యమాలతో అతనికి ఉన్న సన్నిహిత సంబంధం మరో కారణం. 1955లో రాష్ట్ర అసెంబ్లీకి మధ్యంతర ఎన్నికలు వచ్చినపుడు, కాంగ్రెస్‌తో హోరాహోరీ తలపడుతున్న సిపిఐకి మద్దతునిచ్చిన అభ్యుదయ రచయితల సంఘం ముఖ్యుడు శ్రీశ్రీ ఒక్కడే. ప్రత్యర్థి వర్గంలోని సాహితీ మేధావులందరూ ఒక్కటై చేసిన విషపూరితమైన వ్యతిరేక

ప్రచారాలను ఎదుర్కొని సిపిఐ అభ్యర్థి కోసం ప్రచారం చేసిన వ్యక్తి శ్రీశ్రీ. ఈ ఎన్నికల్లో సిపిఐ ఘోరపరాజయం శ్రీశ్రీని ఎంతగా క్రుంగ దీసిందంటే ఆయన కొంతకాలం మానసిక చికిత్స చేయించుకోవలసి వచ్చింది. ఆ తర్వాత భారత – చైనా యుద్ధానంతరం కమ్యూనిస్టులను విచక్షణా రహితంగా అరెస్టులు చేసినపుడు, ఎన్.సి. ఛటర్జీ నాయకత్వంలోని పౌరహక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడిగా శ్రీశ్రీ, సరిహద్దు యుద్ధంపై భారత వైఖరిని విమర్శించడానికి సాహసించిన వారిపట్ల ప్రభుత్వ దమననీతికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి ఎంతో శ్రమించాడు.

అయితే అతనికి అసలు పరీక్ష శ్రీకాకుళంలో విస్తరిస్తున్న నక్సల్‌బరీ ఉద్యమ రూపంలో వచ్చింది. 1960 దశకం ఉత్తరార్థంలో, 1970 దశకం ప్రారంభంలో అభ్యుదయ రచయితల ఉద్యమంలోని ప్రముఖులందరూ వామపక్ష ఉద్యమానికి సంబంధించి తమ అభిప్రాయాలను సంపూర్ణ పునర్మూల్యాంకనం చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. మరీ ముఖ్యంగా 1951 తరవాతి పరిణామాల మీద. పవిత్ర సిద్ధాంతాలు, తీర్మానాలు, అంచనాలను ప్రశ్నించడం మెల్లగా ప్రారంభమైంది; స్మారక చిహ్నాల తలలు నరికి వాటిని మమ్మీలుగా మార్చివేయడం మొదలుపెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి పట్టణంలోనూ శ్రీశ్రీ 60వ జన్మదినం సంబరాలు ఊపందుకుంటున్న సమయంలో, శ్రీకాకుళ గిరిజన ఉద్యమంతో మమేకమైన కొందరు విద్యార్థులు శ్రీశ్రీని, ఆయన తోటి రచయితలను విప్లవంవైపు ఉంటారో, తిరోగమనంవైపు ఉంటారో నిర్ణయించుకోమని సవాలు చేసారు. శ్రీశ్రీ, మరో పిడికెడు మంది విప్లవాన్ని ఎంచుకోవడంవల్ల విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. దీనికి శ్రీశ్రీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా, మరణించేవరకూ సాధారణ సభ్యుడిగా ఉన్నారు. చరిత్ర అవసరాలకు అనుగుణంగా నడుచుకోడానికి నిత్యం సంసిద్ధంగా ఉండే శ్రీశ్రీ, యువ కవుల నుంచి స్ఫూర్తి తీసుకుని, తన కవిత్వ అభివ్యక్తిని, పదచిత్రాలను సరళీకరించుకున్నాడు. రైతాంగ పోరాటాలకు సుదూరంగా మద్రాసు సినీ ప్రపంచంలో జీవిస్తున్నప్పటికీ, వారి బాధల్లో సంపూర్ణంగా లీనం కాగలిగాడు. ఆయన 1970 తర్వాత రాసిన కవితల్లో అత్యుత్తమమైంది నాగభూషణ్ పట్నాయక్‌కు మరణశిక్ష విధించినపుడు రాసినది.

తెల్లవాడు నాడు నిన్ను భగత్సింగు అన్నాడు
నల్లవాడు నువ్వు నేడు నక్సలైటువన్నాడు
ఎల్లవారు నిన్ను రేపు వేగుజుక్క అంటారు...
ఇంక్విలాబ్ ఇంక్విలాబ్ ఇంక్విలాబ్ జిందాబాద్.

అని సాగుతుంది. ఇన్ని చేసినా, రాసినా విప్లవోద్యమంతో అతని అనుబంధం పూర్తి సామరస్యపూర్వకంగా ఎప్పుడూ లేదు. దానికి కారణం, అతని మాటల్లోనే చెప్పాలంటే అతను సాహిత్యంలో అతివాదిగానూ, రాజకీయాల్లో మితవాదిగానూ ఉన్నాడు. తను ఎర్ర సైన్యం సమరయాత్రకు పులకించిపోయిన తరానికి చెందినవాడు. ఈ ప్రపంచంలో సోవియట్ యూనియన్ మాత్రమే సోషలిజంను కాపాడగలదన్న నమ్మకం ఉన్న తరానికి చెందినవాడు. సంవత్సరం క్రితం కూడా ఆయన అఫ్ఘానిస్తాన్‌లో సోవియట్ జోక్యాన్ని వెనకేసుకు వచ్చాడు. తర్వాత ఉపసంహరించు కున్నాడనుకోండి. అంతకంటే అతనిమీద పెద్ద మచ్చ, అత్యవసర పరిస్థితిపై కాసేపు ఒక రకంగా కాసేపు మరో రకంగా మాట్లాడడం. తన తప్పును ఇటీవలే బహిరంగంగా అంగీకరించాడు కూడ. అటువంటి సమయాల్లో ఒక రకమైన అమాయకత్వంతో ఆయన ఉటంకించే లెనిన్ వాక్యం ఒకటుంది. 'గోర్కీ సాహిత్యంలో మేధావే కాని రాజకీయాలలో మూర్ఖుడ'నే వాక్యం అది.

ఇవన్నీ ఉన్నప్పటికీ విప్లవోద్యమానికి ఆయన చేసిన దోహదం కేవలం ప్రతీకాత్మకమే కాదు. డెబ్భయ్యవ దశకం ప్రారంభంలో శ్రీకాకుళ ఉద్యమం మీద ప్రభుత్వం అవలంబించిన దమనకాండపై అలుపులేని పోరాటం జరిపాడు శ్రీశ్రీ. ముగ్గురు విరసం రచయితల అరెస్టుపై రాష్ట్ర హోంమంత్రికి ఆగ్రహంతో రాసిన లేఖలో శ్రీశ్రీ తన చిరునామాను కేరాఫ్ నాగభూషణ్ పట్నాయక్, అతను ఎక్కడున్నాగానీ అని ఇచ్చాడు. (అప్పటికి పట్నాయక్ ఉరిశిక్ష పడి విశాఖపట్నం జైల్లో ఉన్నాడు). భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి శ్రీశ్రీ చాలానే శ్రమించాడు. వయసు పైబడిన దశలో ప్రజాస్వామిక హక్కుల కోసం రాష్ట్రం నలుమూలలా అవిశ్రాంతంగా పర్యటించవలసి వచ్చినప్పుడు, ఆయన తనను తాను 'మహాకవి'నని మాత్రమే కాదు; మనసా, వాచా గొప్ప విప్లవయోధుడనని కూడా నిరూపించుకున్నాడు. తన అనాలోచిత చర్యల వలన ఒక మేధావిగా శ్రీశ్రీ తరచూ తడబడ్డా, కొన్నిసార్లు హానికలిగించే వైఖరిని అవలంబించినా ఆయన మనసా వాచా విప్లవయోధుడిగానే చివరివరకూ ఉన్నాడు.